

TG/TEL/25/A3731

నిజం
దృష్టి తెలుగు న్యూస్

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-324 | పేజీలు:-4 | సోమవారం 16-11-2026

Hydrabab | Editer name : varudu sujatha | volume:01, | issue:324 | pages:04 | Monday - 16-11-2026



ప్రధాని మోదీతో భేటీ అయిన
రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి

- రాష్ట్రంలో కరవు నివారణ చర్యల కోసం రూ.30 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలని విజ్ఞప్తి
- ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నమోదైన 17 శాతం లోటు వర్షపాతంపై ప్రధానికి వివరణ
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్, ఖేలో ఇండియా క్రీడలకు ప్రధానికి ఆహ్వానం
- తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు రావాలని ఆహ్వానం
- రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై ప్రధానితో చర్చ
- ఎల్‌నినోతో ఏర్పడిన కరవు పరిస్థితులు, ఆర్థిక సాయం గురించి వివరించిన సీఎం
- సమ్మక్క--సారక్క బ్యారేజీ క్లియరెన్స్ ప్రక్రియ వేగవంతం చేయాలని అభ్యర్థన



హైదరాబాద్ :

ఢిల్లీలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాసేపటి క్రితం సమావేశమయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ, కరవు పరిస్థితులను అధిగమించడానికి, రైతులను ఆదుకోవడానికి తక్షణమే రూ.30 వేల కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్యాకేజీ రూపంలో అందించాలని ప్రధానికి విజ్ఞప్తి చేస్తూ ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ భేటీలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ కూడా ఈ సమావేశంలో ఉన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం తీవ్రంగా పడిపోయిన తీరును ముఖ్యమంత్రి ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు రాష్ట్రంలో సుమారు 17 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు వివరించారు.రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను 31 జిల్లాల్లోని 365 మండలాలను ఇప్పటికే కరువు ప్రాంతాలుగా ప్రకటించిన విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రధానికి తెలియజేశారు. ఇందులో 111 మండలాలు తీవ్ర కరవు బారిన పడగా, 254 మండలాలు మధ్యస్థాయి కరవును ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. వర్షాభావం కారణంగా ఖరీఫ్ సీజన్ సాగు విస్తీర్ణం 139.28 లక్షల ఎకరాల నుంచి 126.06 లక్షల ఎకరాలకు తగ్గిపోయిందని వివరించారు. - మిగతా 2 లో



హైదరాబాద్‌లో
భారీ అగ్నిప్రమాదం

- బొరంపేట వద్ద ఐదు బస్సుల దగ్ధం
- పార్కింగ్ యార్డులో నిలిపి ఉంచిన ఐదు బస్సులు దగ్ధం
- అర్ధరాత్రి వేగంగా వ్యాపించిన మంటలు
- షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని అనుమానం
- ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్ :

హైదరాబాద్ శివారు బొరంపేటలో శనివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ ప్రైవేట్ - మిగతా 2 లో

రాహుల్ గాంధీకి సీఎం బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు
- కాంగ్రెస్ బీజేపీ నేతల తీరుపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- రాహుల్ బైక్ వెనుక మంత్రులు పరిగెత్తడంపై ఆగ్రహం
- తెలంగాణ పునాది ఆత్మగౌరవమన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ ప్రొటోకాల్‌పై బీఆర్ఎస్ ప్రశ్నలు
- ఫిట్‌గా ఉన్నందునే పరిగెత్తానన్న పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

మావోయిస్టుల హింసాకాండతో
ఆదివాసీలు నష్టపోయారు



- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- దేశం సాధించిన విజయాల్లో నక్సలిజం- మావోయిజం నుంచి విముక్తి పొందడం కూడా ఒకటని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు
- జనజాతీయ గౌరవ్ దివస్ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ

ఢిల్లీ :

మావోయిస్టుల హింసాకాండ వల్ల ఆదివాసీలు నష్టపోయారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గత ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా వారిని గాలికొదిలేశాయని ఆరోపించారు. నక్సలైట్లు గిరిజనుల ఓటు హక్కును సైతం కాలరాసినా నాటి పాలకులు చోద్యం చూస్తూ ఉండిపోయారని విమర్శించారు. స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా మహారాష్ట్ర గడ్చిరోలిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా ప్రసంగించారు. 3వేల కోట్ల రూపాయల విలువైన 246 అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. దశాబ్దాలుగా కనీస వసతులకు నోచుకోని గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మోదీ తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రగతి కోసం లక్ష కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. గిరిజన వర్గాలు ఎల్లప్పుడూ అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడ్డాయని ప్రశంసించారు. దేశంలో 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడం, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత్ సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటని అన్నారు."మావోల హింస వల్ల గిరిజన సమాజం ఎక్కువగా నష్టం పోయింది. 2014లో దేశంలోని దాదాపు 125 - మిగతా 2 లో



స్టార్‌షిప్‌ను
ఒడిసిపట్టిన స్పేస్‌ఎక్స్

- ఏళ్ల నాటి కల సాకారం!
- అంతరిక్ష యాత్ర ముగించుకుని భూమికి చేరిన స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్
- టెక్సాస్‌లోని లాంచ్ టవర్ మెకానికల్ చేతులతో విజయవంతంగా క్యాచ్
- పునర్వినియోగ రాకెట్ల తయారీలో స్పేస్‌ఎక్స్ చారిత్రక మైలురాయి
- రాకెట్ రెండు భాగాలను తిరిగి పొందే ప్రణాళికలో కీలక ముందడుగు

ఢిల్లీ :

ప్రపంచ అంతరిక్ష ప్రయోగాల్లో స్పేస్‌ఎక్స్ సంస్థ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఏళ్ల తరబడి శ్రమిస్తున్న ఒక అసాధారణ లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది. అంతరిక్ష కక్ష్యలోకి వెళ్లి, భూమికి తిరిగి వచ్చిన తన స్టార్‌షిప్ వ్యోమనౌకను (అప్పర్ స్టేజ్) ఈరోజు టెక్సాస్‌లోని లాంచ్ టవర్ వద్ద ఉన్న భారీ యాంత్రిక చేతులతో సురక్షితంగా పట్టుకుంది. పూర్తిస్థాయిలో, వేగంగా - మిగతా 2 లో



1950 తర్వాత
అత్యంత తీవ్రమైన ఎల్‌నినో

- 2027 వరకు ప్రపంచానికి తప్పని ముప్పు!
- 2027 మార్చి వరకు దీని ప్రభావం కొనసాగే అవకాశం
- పసిఫిక్ మహాసముద్రంలో రికార్డు స్థాయిలో పెరుగుతున్న ఉపరితల ఉష్ణోగ్రతలు
- ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో భారీ మార్పులు!
- అమెరికాకు చెందిన ఎన్‌వోఏఏ, డబ్ల్యూఎంవో సంస్థల నివేదిక

డిసెంబర్ మొదటి వారంలో
శీతాకాల సమావేశాలు



- మళ్లీ తెరముందుకు మహిళా రిజర్వేషన్ బిల్లు!
- పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది

ఢిల్లీ :

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ వాతావరణం అంతకంతకూ ఘర్షణపూరితంగా మారుతున్న నేపథ్యంలో, డీలిమిటేషన్‌కు సంబంధించిన ప్రతిపాదిత మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రభుత్వానికి అతిపెద్ద శాసనపరమైన ప్రాధాన్యంగా మారింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డీలిమిటేషన్ ద్వారా లోక్‌సభ బలాన్ని ప్రస్తుతమున్న 543 సీట్ల నుంచి గరిష్ఠంగా 850కి విస్తరించాలని కోరుతున్న ఈ రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేయడానికి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇది 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు మార్గం సుగమం చేయనుంది.



సీఎం చంద్రబాబు కాన్వాయ్‌లోకి

కొత్త వాహనాలు

- ఆరు ఫోర్స్ అర్బానియా వాహనాల కొనుగోలుకు ఆమోదం
- వాహనాల కోసం రూ. 1.78 కోట్లు మంజూరు చేసిన ఏపీ ప్రభుత్వం
- జెమ్ పోర్టల్ ద్వారా కొనుగోలు ప్రక్రియ
- భద్రతా సిబ్బంది ప్రయాణ సౌలభ్యం కోసం అధునిక ఏర్పాట్లు

అమరావతి :

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రతా విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం సెక్యూరిటీ కాన్వాయ్ అవసరాల దృష్ట్యా - మిగతా 2 లో

రాష్ట్రానికి మరో
తుపాను ముప్పు



- ప్రస్తుతం ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం కేంద్రీకృతమైంది
- ఉత్తర కోస్తా వైపు తుపాను కదలికలు
- బంగాళాఖాతంలో బలపడుతున్న వాయుగుండం
- ఏపీ, దక్షిణ ఒడిశాకు వాతావరణ శాఖ హెచ్చరిక
- తీర ప్రాంతాలపై తుపాను ప్రభావం ఉండే అవకాశం

అమరావతి :

రాష్ట్రానికి మరో తుపాను ముప్పు ముంచుకొస్తోంది. ఏపీ, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు వాతావరణ శాఖ తుపాను ముందస్తు హెచ్చరిక జారీ చేసింది. ప్రస్తుతం - మిగతా 2 లో

పంచాయతీ ఎన్నికల సందడి
తొలి విడత నామినేషన్లు షురూ

- ఏపీలో మొదలైన గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ
- తొలి దశలో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఎన్నికలు
- 17వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- నవంబరు 26న పోలింగ్, అదే రోజు ఫలితాలు
- భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేసిన పోలీసులు



అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, తొలి విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రారంభం. మొదటి దశలో అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని పలు మండలాల్లో ఎన్నికలు జరగనుండగా, ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగాలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి.తొలి విడతలో భాగంగా అనంతపురం జిల్లాలోని కల్యాణదుర్గం, అనంతపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 13 మండలాల్లోనూ, కర్నూలు జిల్లాలోని ఆదోని, పత్తికొండ డివిజన్ల పరిధిలోని 8 మండలాల్లోనూ ఎన్నికలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు నవంబర్ 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. 18న నామినేషన్ల పరిశీలన చేపట్టనుండగా, 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉంటుంది. అనంతరం అదే రోజు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.నవంబర్ 26న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. పోలింగ్ ముగిసిన వెంటనే మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు. అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియను కూడా - మిగతా 2 లో

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
సోమవారం 16-11-2026

సంపాదకీయం

అమెరికా ఎన్నికల పాఠం!

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు కాంగ్రెస్‌ను తిరిగి కైవసం చేసుకున్నారు. అక్కడ గెలిచిన అభ్యర్థులు మాట్లాడిన విషయాలు మన రాజకీయ పార్టీలకు, ముఖ్యంగా ప్రతిపక్షాలకు, ఎంతో నేర్పుతాయి. అమెరికాలో ఓటర్లు ఈ ఎన్నికల్లో ఆర్థిక పరిస్థితుల పట్ల ఆందోళనతో పోలింగ్ బూత్‌లకు వెళ్లారు. ఎన్‌బీసీ ఎగ్జిట్‌పోల్ ప్రకారం, 88శాతం మంది నిత్యావసర సరుకుల ధరల గురించి; 86శాతం మంది కరెంటు, నీటి బిల్లుల గురించి; 85శాతం మంది వైద్య ఖర్చుల గురించి ఆందోళన చెందారు. గెలిచిన అభ్యర్థులూ వీటి గురించే మాట్లాడారు. నార్త్ కరోలినాలో రాయ్ కూపర్ 'ధరలు తగ్గిద్దాం' అనే నినాదంతో ప్రచారం మొదలుపెట్టారు. సౌత్ కరోలినాలో అనీ ఆండ్రూస్ అందరికీ అందుబాటులో వైద్యం, తక్కువ ఖర్చు అనే అంశాలపై పోటీ చేశారు. ఇంకా చాలామంది అభ్యర్థులు ఇలాంటి సమస్యలపైనే మాట్లాడారు. అలా అని వాళ్లు అమెరికాలో పెరుగుతున్న జాతి విద్వేషాల గురించీ, హింస గురించీ మాట్లాడలేదని కాదు. అమెరికన్ ఓటర్ల ఆందోళనలో ఆర్థిక వ్యవస్థ తర్వాత రెండో స్థానంలో ప్రజాస్వామ్యమే ఉంది. గెలిచినవాళ్లు చేసింది ఏమిటంటే, ఈ రెండింటినీ కలిపి చెప్పడం. వాళ్లందరి సందేశం సరళమైనది. అధికారం కొద్దిమంది చేతుల్లోకి వెళ్లిందంటే దాని ఫలితంగా మీ ఇంటి అద్దె పెరుగుతుంది, ఆసుపత్రి బిల్లులు పెరుగుతాయి. ఈ సందేశం ఎలా పనిచేసిందంటే-- విలువల గురించి మాట్లాడితే అప్పటికే ఆ విలువల గురించి ఆందోళన చెందే కొందరి సమ్మతి మాత్రమే లభిస్తుంది. అదే ఆ విలువలను వంటింటి సమస్యలతోనో పెరుగుతున్న ధరలతోనో ఆరోగ్య వసతితోనో కలిపి చెప్తే అప్పుడు అందరూ కదులుతారు.మన దేశంలో ఈ సమస్యలు మరింత దారుణంగా ఉన్నాయి. రిటైల్ ద్రవ్యోల్బణం 6.09శాతానికి పెరిగింది. ఆహార ద్రవ్యోల్బణం 8.94శాతానికి ఎగబాకింది. నగరాల్లో ద్రవ్యోల్బణం 5.41శాతం ఉంటే, గ్రామాల్లో అది 6.63శాతం. ఒక రోజువారీ కూలీకి కూరగాయలు, పప్పుల మీద పెరిగే ప్రతి రూపాయి, పిల్లల పుస్తకాల నుంచో, ఆసుపత్రికి వెళ్లే ఖర్చు నుంచో కోత పడుతున్నది. నగరాల్లో యువత నిరుద్యోగం 19శాతానికి చేరింది. జాతీయ ఆరోగ్య సంస్థ తాజా అంచనాల ప్రకారం, ప్రస్తుత ఆరోగ్య వ్యయంలో దాదాపు సగాన్ని ప్రజలు తమ జేబు నుంచే భరిస్తున్నారు. ఈ సమస్యలకు నగరాల్లో అద్దెలు, పాఠశాల ఫీజులు, ప్రభుత్వ శిశు సంరక్షణ సౌకర్యాల కొరత కలిపితే... సామాన్య భారతీయుడి జీవితాన్ని ప్రభావితం చేసే అసలు ఎజెండా ఏమిటో అర్థమవుతుంది.2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు సీఎస్‌డీఎస్--లోక్‌నీతి సర్వేలో 27శాతం మంది నిరుద్యోగాన్ని తమ ప్రధాన సమస్య అని చెప్పారు. 23శాతం మంది ధరల పెరుగుదల అని చెప్పారు. ఇందుకు భిన్నంగా రామమందిరం తమ ఓటును నిర్ణయించే ప్రధాన అంశమని చెప్పింది 8శాతం మంది మాత్రమే. భారతదేశ సామాజిక, సాంస్కృతిక, మత స్వరూపంలో వస్తున్న మార్పులు ముఖ్యం కాదని అనలేం. కానీ మీ జీవితాన్ని, మీ ఓటును ఏది నిర్ణయిస్తుందని ప్రజలను అడిగినప్పుడల్లా వాళ్ల సమాధానం మళ్లీ మళ్లీ ఉద్యోగాలు, ధరల దగ్గరకే వస్తోంది.ఈ ఏడాది పేపర్ లీక్ కారణంగా దేశ యువత రోడ్ల మీదకు వచ్చింది. వారి నిరసనలు విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చేంత పెద్దవయ్యాయి. సెప్టెంబర్, అక్టోబర్ నాటికి ఈ నిరసనలు ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ దాకా విస్తరించాయి. పరీక్షల విశ్వసనీయత, న్యాయమైన ఎన్నికలు అత్యంత ముఖ్యమైనవే. కానీ యువత ఆగ్రహం లోతుల్లోకి చూస్తే నిరుద్యోగం, ఆర్థికంగా ఎదిగే అవకాశాలు లేకపోవడమే ఈ నిరసనలకు దారితీసిందని అర్థమవుతుంది.నగర విద్యార్థుల ఉద్యమం ఎంత ప్రభావవంతంగా ఉన్నప్పటికీ అది ఒక్కటే రాజకీయ ఎజెండాను మార్చలేదు. గ్రామీణ భారతం కూడా అందులో కలవాలి. గ్రామాలు ఇప్పటికీ అవే సమస్యలతో సతమతమవుతున్నాయి. గ్రామీణ యువత నిరుద్యోగం నానాటికీ పెరుగుతూనే ఉంది. డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న యువకుడు, కోచింగ్ ఫీజు కట్టలేని యువతి, నీట్ పేపర్ వాట్సాప్‌లో లీకవడం చూసిన రైతు కొడుకు... వీళ్లందరిలోనూ ఢిల్లీ విద్యార్థిలోని ఆగ్రహమే ఉంది. కానీ వ్యక్తం చేయడానికి వాళ్లకు వేదికలు తక్కువ. నగర --గ్రామీణ ప్రపంచాల మధ్య బంధం బలపడినప్పుడు, గ్రామీణ పేదలు, నగర యువత ఒకేలాంటి విషయాల గురించి మాట్లాడటం మొదలుపెట్టినప్పుడు, అప్పుడవి 'యువత సమస్యలు'గానో, రైతుల సమస్యలు'గానో మిగలవు. రాజకీయ పోటీకి కేంద్ర బిందువులు అవుతాయి. రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే అంశాల చుట్టూ ప్రజలను సంఘటితం చేయాలి. పప్పు ధర, నగరంలో గది అద్దె, ప్రైవేటు ఆసుపత్రిలో ప్రసవ ఖర్చు, డిగ్రీ తర్వాత ఎప్పటికీ రాని ఉద్యోగం ఇలాంటి రోజువారీ సమస్యలను న్యాయం, అధికారం అనే పెద్ద ప్రశ్నలతో ముడిపెట్టాలి. పేదల తరపున మాట్లాడాలనుకునే ఏ పార్టీ అయినా అమెరికా మధ్యంతర ఎన్నికల నుంచి నేర్చుకోవాల్సిన పాఠం ఇదే.



మావోయిస్టుల హింసాకాండతో ఆదివాసీలు నష్టపోయారు

మొదటిపేజీ తరువాయి -

జిల్లాలు మావోయిజం, నక్సలిజంతో ఇబ్బందిపడ్డాయి. ఏటా వందలాది హింసాత్మక ఘటనలు జరిగేవి. ఈ ఘటనల్లో వేలాది మంది అమాయకులు తమ ప్రాణాలను కోల్పోవాల్సి వచ్చింది. మృతుల్లో ఆదివాసీ సోదర సోదరీమణులే అత్యధిక సంఖ్యలో ఉండేవారు. గత ప్రభుత్వాలు మావోయిజం, నక్సలిజం బారిన పడిన గిరిజనులను గాలికి వదిలేశాయి. గిరిజనుల హక్కులను లాక్కున్నా నోటికి తాళం వేసుకుని కూర్చున్నారు. గిరిజన సమాజ సోదర సోదరీమణులను కనీసం ఓటు కూడా వేయనిచ్చేవారు కాదు. అప్పటి ప్రభుత్వాలు కేవలం ప్రేక్షక పాత్ర వహిస్తూ కళ్లు మూసుకున్నాయి. నేడు నక్సలిజం-మావోయిజం పూర్తిగా అంతం కావడంతో గిరిజన సమాజానికి చెందిన తల్లులు, సోదరీమణులు మాకు తమ ఆశీస్సులను అందిస్తున్నారు. దేశం సాధించిన విజయాల్లో నక్సలిజం-మావోయిజం నుంచి విముక్తి పొందడం కూడా ఒకటి. కొద్ది రోజుల క్రితమే ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ కేంద్రంలో నేను భద్రతా దళాలతో కలిసి దీపావళి జరుపుకొన్నాను. ఒకప్పుడు ప్రజలు వెళ్లడానికి కూడా భయపడిన ప్రాంతం అది. గడ్చిరోలితో సహా నక్సల్ ప్రభావిత ప్రాంతాలన్నింటిలోనూ ఇప్పుడు కేవలం దీపావళి దీపాలే కాకుండా, ప్రజల జీవితాల్లో ఒక కొత్త ఆశాకిరణం కూడా ప్రసరించింది.'జనజాతీయ గౌరవ్ దివస్' అనేది గిరిజన సమాజం గౌరవానికి, గిరిజన నాయకుడు బిర్సా ముండా అందించిన స్ఫూర్తికి సంబంధించిన పండుగ అని ప్రధాని మోదీ అభివర్ణించారు. "2021 నవంబర్ 15 నుంచి 'జనజాతీయ గౌరవ్ దివస్' (గిరిజన గౌరవ దినోత్సవం) జరుపుకొంటున్నాం. నేడు ఇది ఒక జాతీయ వేడుకగా మారింది. గతేడాది భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా 2 లక్షలకు పైగా కార్యక్రమాలు జరిగాయి. వీటిలో కోట్ల మంది పౌరులు పాల్గొన్నారు. ఒకప్పుడు అనేక పండుగలు, సందర్భాలు విదేశీ దృక్కోణం నుంచి నిర్ణయించేవారు. కానీ నేడు, భారతదేశం తన వారసత్వాన్ని, చరిత్రను, వీరులను స్వదేశీ గర్వంతో స్మరించుకుంటోంది. ఇది మన జాతీయ చైతన్యంలో వచ్చిన ఒక పెద్ద మార్పునకు సంకేతం." అని ప్రధాని మోదీ అన్నారు. భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నవంబర్ 15న జనజాతీయ గౌరవ్ దివస్‌ను పాటిస్తారు. 1875లో గిరిజన సమాజంలో జన్మించిన బిర్సా ముండా, బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన గిరిజన ప్రతిఘటనలో ప్రముఖ నాయకుడిగా ఎదిగారు.

1950 తర్వాత అత్యంత తీవ్రమైన ఎల్‌నినో

మొదటిపేజీ తరువాయి - ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే ఎల్‌నినో మరింత బలపడుతోంది. 1950 తర్వాత ఇదే అత్యంత శక్తిమంతమైన ఎల్‌నినోగా మారనుందని, దీని ప్రభావం 2027 మార్చి వరకు కొనసాగవచ్చని అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్‌వోఏఏ) తాజాగా హెచ్చరించింది. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సరళిలో భారీ మార్పులకు కారణం కానుందని ఆందోళన వ్యక్తం చేసింది.ఎల్‌నినో కారణంగా భూమధ్యరేఖ వెంబడి పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయిలో వేగంగా పెరుగుతున్నాయి. ఈ పెరుగుదల గతంలోని అన్ని రికార్డులను బద్దలు కొట్టనుందని ఎన్‌వోఏఏ తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వర్షపాతంలో తీవ్ర వ్యత్యాసాలు చోటుచేసుకుంటాయి. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించనుండగా, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్ర కరవు పరిస్థితులు నెలకొంటాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా, ప్రపంచవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు పెరగడం, అడవుల్లో కార్చిచ్చులు అధికమవడం వంటి పరిణామాలు కూడా సంభవిస్తాయి.ఎన్‌వోఏఏ, ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) నివేదికల ప్రకారం, ఎల్‌నినో తీవ్రత క్రమంగా పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా 2027 జనవరి నుంచి మార్చి మధ్య కాలంలో ఇది అత్యంత బలమైన స్థాయిలో కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివిధ దేశాలు వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రధాని మోదీతో భేటీ అయిన రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి - కరవు సహాయక చర్యలతో పాటు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు, నిధుల కేటాయింపులపై కూడా చర్చించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'తో పాటు 'ఖేలో ఇండియా' క్రీడల ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధాని మోదీని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.



స్టార్‌షిప్‌ను ఒడిసిపట్టిన స్పేస్‌ఎక్స్

మొదటిపేజీ తరువాయి - పునర్వినియోగించగల రాకెట్లను తయారు చేయాలనే స్పేస్‌ఎక్స్ లక్ష్య సాధనలో ఇది ఒక చారిత్రక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.ఇవాళ భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 2:52 గంటలకు 'షిప్ 42' అనే ఈ స్టార్‌షిప్‌ను లాంచ్ టవర్‌కు అమర్చిన 'చాప్‌స్టిక్స్' అనే భారీ మెకానికల్ చేతులు గాల్లోనే పట్టుకున్నాయి. ఈ అద్భుత ఘట్టానికి ముందు, స్టార్‌షిప్ దాదాపు 22 గంటలకు పైగా అంతరిక్షంలో గడిపింది. నవంబర్ 14న సౌత్ టెక్సాస్‌లోని స్టార్‌బేస్ నుంచి నింగిలోకి ఎగిసిన ఈ రాకెట్, భూమికి 275 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న నిమ్న భూకక్ష్యకు చేరుకుంది.తన 15వ ఇంటిగ్రేటెడ్ ఫ్లైట్ టెస్ట్‌లో భాగంగా, ఈ స్టార్‌షిప్ కక్ష్యలో ఉన్న సమయంలో భూమి చుట్టూ దాదాపు 14 సార్లు ప్రదక్షిణలు చేసింది. ఈ యాత్రలో అత్యంత కీలకమైన 26 నెక్స్ట్ జనరేషన్ స్టార్‌లింక్ ఎ3 ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. అంతేకాకుండా వ్యోమనౌకతో పాటు పంపిన మూడు ఉపగ్రహాలు స్టార్‌షిప్ హీట్ షీల్డ్ (వేడి కవచం), ఇతర భాగాలను నిశితంగా పరిశీలించాయి. భూమికి తిరిగి వచ్చే ప్రయాణానికి నౌక ఎంత సిద్ధంగా ఉందో అంచనా వేయడానికి ఈ కెమెరాల ద్వారా అందిన సమాచారం ఇంజనీర్లకు ఎంతగానో సహాయపడింది.అన్ని తనిఖీలు పూర్తయిన తర్వాత, స్టార్‌షిప్ తన ఇంజిన్లను మండించి (డీ-ఆర్బిట్ బర్న్) భూ వాతావరణంలోకి ప్రవేశించడం ప్రారంభించింది. కిందకు దిగే క్రమంలో తన వేగాన్ని నియంత్రించుకుంటూ, స్టార్‌బేస్‌లోని లాంచ్ టవర్‌కు కచ్చితంగా వచ్చేలా తనను తాను మలచుకుంది. ఆ తర్వాత టవర్‌కు ఉన్న రెండు భారీ యాంత్రిక చేతులు వ్యోమనౌకను సున్నితంగా పట్టుకుని, లాంచ్ ప్యాడ్ పైన గాలిలో నిలిపివేశాయి.గతంలో స్పేస్‌ఎక్స్ తన సూపర్ హెవీ బూస్టర్లను విజయవంతంగా రికవరీ చేసి, తిరిగి ఉపయోగించినప్పటికీ, కక్ష్య నుంచి తిరిగి వచ్చిన స్టార్‌షిప్ అప్పర్ స్టేజ్‌ను ఇలా టవర్‌తో పట్టుకోవడం ఇదే తొలిసారి. రాకెట్‌లోని రెండు భాగాలను (బూస్టర్, అప్పర్ స్టేజ్) తిరిగి భూమికి తెచ్చి, తనిఖీ చేసి, మళ్లీ ప్రయోగాలకు వాడాలన్నది స్పేస్‌ఎక్స్ ప్రణాళిక. తాజా విజయంతో ఆ ప్రణాళికలో ఒక ముఖ్యమైన భాగాన్ని నిరూపించినట్లయింది.ఈ 15వ ప్రయోగంలో వాస్తవానికి రాకెట్‌కు చెందిన రెండు భాగాలను టవర్‌తో పట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, సూపర్ హెవీ బూస్టర్‌ను పట్టుకునే ప్రణాళిక చివరి నిమిషంలో రద్దు కావడంతో, అది గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్రంలో సురక్షితంగా ల్యాండ్ అయింది.ఈ చిన్న లోపం మినహా, స్టార్‌షిప్ అప్పర్ స్టేజ్‌ను పట్టుకోవడం ద్వారా ఈ మిషన్ ఒక ప్రధాన లక్ష్యాన్ని సాధించింది. రాకెట్లను పునర్వినియోగించడం ద్వారా ప్రయోగాల ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చు. ఇది భవిష్యత్తులో చంద్రుడు, అంగారకుడిపైకి మానవసహిత యాత్రలు చేపట్టాలన్న స్పేస్‌ఎక్స్ ఆశయాలకు మరింత ఊతమిస్తుంది.

రాహుల్ గాంధీకి సీఎం బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారు

మొదటిపేజీ తరువాయి -

తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవం అనే ప్రాతిపదికన ఏర్పాటయిందని, అయితే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఈ విషయాన్ని ఎప్పటికీ అర్థం చేసుకోలేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొన్న కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల తీరుపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు.తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతలకు పదవుల తాలూకు హుందాతనం, గౌరవం తెలియకుండా పోయిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. గాంధీ కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు సైతం రాహుల్ గాంధీ నడుపుతున్న బైక్ వెనుక నౌకర్ల మాదిరిగా పరుగులు తీస్తున్నారని ఎద్దేవా చేశారు. శనివారం నాడు గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్ గాంధీ నిర్వహించిన బైక్ ర్యాలీ దృశ్యాలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఇదే సమయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని కూడా కేటీఆర్ తప్పుపట్టారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గతంలో అమిత్ షా కాళ్లకు మొక్కడం, ఆయన చెప్పులు మోయడం వంటి చర్యలను గుర్తుచేస్తూ, ఇది అత్యంత సిగ్గుచేటైన, అనుచితమైన ప్రవర్తన అని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఈ రెండు జాతీయ పార్టీలు ఏనాడూ గౌరవించలేవని ఆయన స్పష్టం చేశారు.కాగా, రాహుల్ గాంధీ బైక్ వెనుక తాను పరిగెత్తడంపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టత ఇచ్చారు. తాను కూడా బైక్‌పైనే వెళుతున్న క్రమంలో వాహనం స్కిడ్ అయ్యిందని, రాహుల్ గాంధీ తనను గమనించి పక్కకు పిలిచారని తెలిపారు. తాను శారీరకంగా ఫిట్‌గా ఉన్నందునే పక్కనే పరిగెత్తుకుంటూ వెళ్లానని, రాహుల్ గాంధీ వెంట అలా పరిగెత్తడం తన అదృష్టంగా భావిస్తున్నానని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.మరోవైపు, అధికారిక ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ పాల్గొనడంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని నీతులు చెబితే సరిపోదని, ముందుగా రాజ్యాంగ విలువలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికింది. ఏ హోదాలో, ఏ ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రారంభిస్తున్నారని ప్రశ్నించింది. రాహుల్ గాంధీ శనివారం గిగ్ వర్కర్ల సంక్షేమ ప్యాకేజీని ప్రకటించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'భారత్ సమ్మిట్' ముగింపు సభలో ప్రసంగించిన నేపథ్యంలో బీఆర్ఎస్ ఈ ప్రశ్నలను సంధించింది.

పంచాయతీ ఎన్నికల సందడి తొలి విడత నామినేషన్లు షురూ

మొదటిపేజీ తరువాయి - పూర్తి చేస్తారు.ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థితో పాటు మరో ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ర్యాలీలు, ఊరేగింపులపై ఆంక్షలు విధించామని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం చంద్రబాబు కాన్వాయ్‌లోకి కొత్త వాహనాలు

మొదటిపేజీ తరువాయి - కొత్త వాహనాలను సమకూర్చడానికి అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కాన్వాయ్‌లోకి కొత్తగా 6 అత్యాధునిక 'ఫోర్స్ అర్బానియా' వాహనాలను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హోంశాఖ అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది.ముఖ్యమంత్రి కాన్వాయ్ కోసం ఈ 6 వాహనాల కొనుగోలుకు సుమారు రూ. 1.78 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్రక్రియను పూర్తిగా నిబంధనల ప్రకారం పారదర్శకంగా చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా 'జెమ్' పోర్టల్ ద్వారా కొనుగోలు ప్రక్రియను త్వరలోనే పూర్తి చేయాలని అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.సీఎం కాన్వాయ్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించే భద్రతా సిబ్బంది ప్రయాణం మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆధునిక హంగులు, విశాలమైన స్థలం, అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించేందుకు అనువైన సాంకేతిక ఫీచర్లు ఈ వాహనాల్లో ఉన్నాయి. ఈ కొత్త వాహనాల చేరికతో భద్రతా సిబ్బంది రాకపోకలు మరింత వేగవంతం కావడంతో పాటు ముఖ్యమంత్రి కాన్వాయ్ పనితీరు, సామర్థ్యం మరింత మెరుగుపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఈ వాహనాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

రాష్ట్రానికి మరో తుపాను ముప్పు

మొదటిపేజీ తరువాయి - ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం కేంద్రీకృతమైంది. ఇది గంటకు సుమారు 10 కిలోమీటర్ల వేగంతో ఉత్తర దిశగా కదులుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు గుర్తించారు. ఇది ప్రస్తుతానికి చెన్నైకి 840 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 1010 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్ కు 1130 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. ఈ వాయుగుండం తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.ఈ వాయుగుండం తదుపరి ఉత్తర- వాయువ్య దిశగా కదిలి తర్వాత దక్షిణ, మధ్య పశ్చిమ బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశముంది. ఆ తర్వాతి రెండురోజుల్లో వాయవ్య దిశగా కదులుతూ రాష్ట్ర తీరప్రాంతం వైపు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ప్రస్తుతం వాయుగుండం గమనాన్ని వెదర్ డాప్లర్ రాడార్ల ద్వారా నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం అంచనాల ప్రకారం దీని ప్రభావం రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశా ప్రాంతాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

మొదటిపేజీ తరువాయి - పార్కింగ్ యార్డులో నిలిపి ఉంచిన ఐదు ట్రావెల్స్ బస్సులు మంటలకు ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొడ్రాయి సమీపంలో గల పార్కింగ్ స్థలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సులను ఒకదానికొకటి అతి సమీపంలో నిలిపి ఉంచడంతో, ఒక బస్సులో మొదలైన మంటలు శరవేగంగా ఇతర బస్సులకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో మూడు బస్సులు పూర్తిగా దగ్ధం కాగా, మరో రెండు బస్సులు పాక్షికంగా దెబ్బతిన్నాయి.అర్ధరాత్రి సమయంలో దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు, సమీపంలోని పెట్రోల్ బంక్ సిబ్బంది వెంటనే అగ్నిమాపక కేంద్రానికి, పోలీసులకు సమాచారం అందించారు. జీడిమెట్ల ఫైర్ స్టేషన్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బస్సులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే, బస్సుల సమీపంలోని చెత్తకుప్పకు నిప్పు అంటుకుని మంటలు వ్యాపించి ఉండవచ్చనే కోణంలోనూ విచారణ జరుపుతున్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు, జరిగిన ఆస్తి నష్టంపై అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ-సిగరెట్ల అక్రమ దందాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం!

ఈగల్ డీఎస్పీ

హైదరాబాద్‌లో టీనేజర్లను లక్ష్యంగా చేసుకొని సాగుతున్న నిషేధిత ఈ-సిగరెట్ల అక్రమ దందాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం మోపుతోంది

ఈ-సిగరెట్లు దొరక్కుండా చేస్తామని డీఎస్పీ మధు మోహన్ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్‌లో యువత, టీనేజర్లను లక్ష్యంగా చేసుకొని సాగుతున్న నిషేధిత ఈ-సిగరెట్ల అక్రమ దందాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం మోపుతోంది. రాయదుర్గంలోని ఓ అవుట్‌లెట్‌పై దాడిచేసి భారీగా నిషేధిత వేప్స్, విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. పన్నులు ఎగ్గొట్టి చైనా నుంచి అక్రమంగా దిగుమతి చేసుకుంటూ ర్యాపిడో, ఉబర్, ఓలా వంటి యాప్‌ల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా డెలివరీ చేస్తున్నట్లు గుర్తించామని ఈగల్ డీఎస్పీ మధు మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ అక్రమ దందాపై ఈటీవీ భారత్ ముఖాముఖిలో అనేక వివరాలు వెల్లడించారు.2019 లో కేంద్ర ప్రభుత్వం వేప్స్, ఈ-సిగరెట్లపై నిషేధం విధించింది. ఈజీ మనీ కోసం కొంతమంది వ్యక్తులు వీటిని చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం లాంటి ప్రాంతాల్లో కేరళకు చెందిన వ్యక్తులు కూల్‌డ్రింక్‌లు, పెర్‌ఫ్యూమ్ షాపుల మాటున వేప్స్, ఈ-సిగరెట్ల దందా పకడ్బందీగా నడుపుతున్నట్లుగా గుర్తించాం. ఆయా షాపులకు సంబంధించి ప్రత్యేక వాట్సప్ గ్రూప్‌ను క్రియేట్ చేసుకొని, ఆ గ్రూపులో కస్టమర్లను యాడ్ చేసుకుంటున్నారు. వేప్స్, ఈ-సిగరెట్ల కొత్త స్టాక్ వివరాలు ఆ గ్రూప్‌లో పోస్ట్ చేస్తారు. రోజుకో ఫ్లేవర్ ఉందంటూ ఆ గ్రూప్‌లో ఎక్కువగా ఉన్న టీనేజర్లను ఆకర్షిస్తున్నారు. కొన్ని షాపులోనే అమ్మకాలు చేస్తుండగా, మరికొన్ని వాట్సప్ ద్వారా ఆర్డర్ తీసుకుని కస్టమర్ లొకేషన్‌కు పోర్టర్ ద్వారా, ర్యాపిడో, ఉబర్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నట్లు తెలిసింది. పన్నులు చెల్లించకుండా అక్రమమార్గంలో దందా చేస్తున్నారు. మామూలు సిగరెట్ కంటే నాలుగు రెట్ల హానికరమైన నికోటిన్ కలిగి ఉండే ఈ-సిగరెట్ల వల్ల యువత ఆరోగ్యానికి తీవ్రనష్టం కలుగుతోంది.కేరళంలోని కాసరగోడ్‌కు చెందిన వారు ఎక్కువగా దుబాయిలో ఉంటారు. అక్కడ కొంతమంది ఈ నిషేధిత ఉత్పత్తులను దుబాయి నుంచి ముంబయికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. 2 నెలల్లో 11 కేసులు, 16 మందిని అరెస్ట్ చేశాం. 1600 కు పైగా ఈ-సిగరెట్లు సీజ్ చేశాం. ఆన్‌లైన్ పేమెంట్ కోసం వాడుతున్న అకౌంట్లను ఫ్రీజ్ చేస్తున్నాం. వెనక ఉండి దందా నడిపిస్తున

35 రోజుల పోరాటానికి ఫలితం

పాలిటెక్నిక్‌ల విలీన ప్రతిపాదనకు బ్రేక్

స్కిల్స్ వర్సిటీలోకి ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల తరలింపునకు స్వస్తి

ఉన్నత విద్యాశాఖ పరిధిలోనే కొనసాగిస్తూ జీవో 157 జారీ

ఎరవెల్లి జగన్ సారథ్యంలో ఫలించిన విద్యార్థి జేఏసీ అలుపెరగని ఉద్యమం

ఉద్యమానికి మరింత బలాన్నిచ్చిన అధ్యాపకుల సహాయ నిరాకరణ

హైపవర్ కమిటీ సిఫార్సులతో పాత జీవో 97కు సవరణలు

విద్యార్థి జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్‌కు వెల్లువెత్తుతున్న అభినందనలు



ఎరవెల్లి జగన్ ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థి జేఏసీని సమన్వయం చేస్తూ వరుసగా 35 రోజులపాటు సమరశీల పోరాటాన్ని ముందుండి నడిపించారు. విద్యార్థులు, అధ్యాపకులు, వివిధ విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. సన్నాహక సమావేశాలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, ప్రభుత్వ పెద్దలకు వినతిపత్రాల సమర్పణ వంటి వివిధ రూపాల్లో ఆందోళనలను ఉద్ధృతం చేసి పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లారు.

నిజం న్యూస్ హైదరాబాద్, నవంబర్ 15,2026: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల భవిష్యత్తుపై గత కొంతకాలంగా నెలకొన్న తీవ్ర అనిశ్చితికి తెరదించుతూ తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ లో విలీనం చేయకుండా, ఉన్నత విద్యాశాఖ పరిపాలనా నియంత్రణలోనే కొనసాగిస్తూ నవంబరు 13న జీవో ఎం.ఎస్. నం. 157ను విడుదల చేసింది. గతంలో పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్స్ యూనివర్సిటీతో అనుసంధానిస్తూ తీసుకున్న నిర్ణయంపై విద్యార్థులు, అధ్యాపకుల్లో తీవ్ర ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ప్రభుత్వం వెనక్కి తగ్గడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కీలక పరిణామం వెనుక తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర చైర్మన్, జేఎన్‌టీయూహెచ్ డీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎరవెల్లి జగన్ నేతృత్వంలో సాగిన 35 రోజుల అలుపెరగని ఉద్యమం ప్రధాన పాత్ర పోషించింది.

ఎరవెల్లి జగన్ నాయకత్వంలో 35 రోజుల సమరశీల పోరాటం..

పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థలో మార్పుల పేరుతో ప్రభుత్వం గతంలో తీసుకున్న నిర్ణయాలపై మొదటి నుంచీ విద్యార్థి వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ముఖ్యంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల పరిపాలన, విద్యా ప్రమాణాలు, పరీక్షల నిర్వహణ, సాంకేతిక విద్యామండలి భవిష్యత్తు, అధ్యాపకుల సర్వీసు అంశాలపై అనేక సందేహాలు తలెత్తాయి. ఈ తరుణంలో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు భంగం కలగకుండా చూడాలనే సంకల్పంతో పాలిటెక్నిక్ విద్య ఆధునికీకరణ, విద్యార్థుల విద్యా, ఉద్యోగ ప్రయోజనాల పరిరక్షణకు సంబంధించి ప్రభుత్వం 2026 ఆగస్టు 24న జీవో ఆర్టీ నం. 1239 ద్వారా ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ చేసిన సిఫార్సులను పరిశీలించిన అనంతరం, గతంలో జారీ చేసిన జీవో ఎం.ఎస్. నం. 97కు సవరణలు చేస్తూ తాజాగా జీవో ఎం.ఎస్. నం. 157ను విడుదల చేసింది. ఈ తాజా ఉత్తర్వుల ప్రకారం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు విద్యాశాఖలోని ఉన్నత విద్యా విభాగం పరిపాలనా నియంత్రణలో కొనసాగుతాయి. ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు మాత్రం శక్తి శాఖ పరిధిలోనే కొనసాగుతాయి. వాటి పాఠ్యప్రణాళిక నియంత్రణ బాధ్యతలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అప్పగించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తన విద్యా కార్యక్రమాలను విస్తరించేందుకు ఏఐసీటీఈ, ఇతర సంబంధిత సంస్థల నుంచి అవసరమైన అనుమతులు పొందాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

అధ్యాపకుల సహాయ నిరాకరణతో ఉద్యమానికి మరింత బలం..

ఎరవెల్లి జగన్ సారథ్యంలో విద్యార్థి జేఏసీ చేపట్టిన ఈ ఉద్యమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ అధ్యాపకుల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. అధ్యాపకులు సైతం సహాయ నిరాకరణకు దిగడంతో ఉద్యమం మరింత విస్తృతరూపం దాల్చింది. విద్యార్థుల ఆందోళనలకు అధ్యాపకుల మద్దతు తోడవడంతో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ పరిరక్షణ అంశం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. వివిధ వర్గాలను సమన్వయం చేస్తూ ఎరవెల్లి జగన్ నిరంతరంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో.. విద్యార్థుల విద్యా ప్రయోజనాలు, అధ్యాపకుల హక్కులపై ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



హైపవర్ కమిటీ సిఫార్సులు.. జీవో 157 విడుదల

యూనివర్సిటీ ప్రత్యక్ష పరిపాలనా పరిధిలోకి తీసుకెళ్లకుండా ఉన్నత విద్యాశాఖ పరిధిలోనే ఉంచడం 35 రోజుల ఉద్యమానికి దక్కిన చారిత్రక విజయమని జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేవలం నిరసనలకే పరిమితం కాకుండా, సమస్యలపై నిరంతరం ప్రభుత్వానికి వాస్తవాలను వివరించడం, విద్యార్థుల ఆందోళనలను ఒక సంఘటిత ఉద్యమంగా మలచడంలో ఎరవెల్లి జగన్ ప్రదర్శించిన నాయకత్వ పటిమను విద్యార్థి సంఘాల ప్రతినిధులు కొనియాడుతున్నారు. విద్యా వ్యవస్థలో మార్పులు చేపట్టే సమయంలో విద్యార్థులు, అధ్యాపకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఉద్యమం మరోసారి చాటిచెప్పిందని జేఏసీ వర్గాలు పేర్కొన్నాయి. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ భవిష్యత్తు కోసం 35 రోజుల పాటు అలుపెరగని పోరాటం సాగించి విజయం సాధించిన ఎరవెల్లి జగన్‌కు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, అధ్యాపకులు, జేఏసీ నాయకుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.



జగన్ పోరాటానికి దక్కిన గుర్తింపు.. వెల్లువెత్తుతున్న అభినందనలు

పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్

స్క్రీన్ మాయలో బాల్యం

నిజం న్యూస్ హైదరాబాద్,నవంబర్ 15,2026: నేటి ఆధునిక కాలంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ, మన జీవితాల్లో దాని ప్రాముఖ్యం విపరీతంగా పెరిగిపోతోంది. అయితే, ఈ డిజిటల్ విప్లవం అత్యంత ప్రమాదకరమైన రీతిలో పసిపిల్లల లేత మనసులను కబళిస్తోంది. దేశంలో 'పిల్లవాడు' లేదా 'పిల్లలు' అనే పదానికి అర్థమే మారిపోయింది; కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో చదివేవారిని కూడా "బచ్చే" అని పిలిచే సంస్కృతిలో, అసలైన పసిపిల్లల విద్య, సంక్షేమం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. 'స్క్రీన్ వెనుక ఉన్న మేధస్సు పిల్లలకు దగ్గరవుతున్న కొద్దీ, ఇంటి గోడల మధ్య ఉన్న బంధాలు దూరమవుతున్నాయి' అంటారో విద్యావేత్త. పిల్లలు బడి నుంచి ఇంటికొచ్చిన తర్వాత తమ తల్లిదండ్రులతో ప్రతి విషయాన్నీ పంచుకునే కాలం ఒకప్పుడు ఉండేది. స్నేహితులతో జరిగిన గొడవ నుంచి నచ్చని ఉపాధ్యాయుల వరకు, మాట్లాడటానికి ఎప్పుడూ ఏదో ఒక విషయం ఉండేది. కానీ, ఇప్పటి పిల్లలు తల్లిదండ్రులకు బదులుగా ఏ.ఐ ని ఆశ్రయించవచ్చు. ఎలాంటి భయం లేకుండా ప్రశ్నలు అడగవచ్చు, తమ ఆందోళనలను పంచుకోవచ్చు. తమకు ఇబ్బందికరంగా అనిపించే విషయాల గురించి కూడా ఏఐతో మాట్లాడవచ్చు. ఏ.ఐ అందుబాటులో ఉండే సహచరుడిగా మారుతున్న కొద్దీ, పిల్లలు క్రమంగా తమ తల్లిదండ్రులతో మాట్లాడటం కంటే ఏ.ఐ తో గడిపేందుకే మొగ్గు చూపుతున్నారు. పాలకులు స్మార్ట్‌ఫోన్లను అభ్యసన సాధనాలుగా ప్రచారం చేస్తున్నారు. దీనివల్ల పిల్లల మేధో వికాసం దెబ్బ తింటోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ, ప్రభుత్వాలు కళ్లు తెరవకపోవడం విచారకరం. విద్యారంగంలో జరుగుతున్న పరిణామాలు ఆందోళనకరంగా ఉన్నాయి. సిబిఎస్ఇ మూడో తరగతి నుంచే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏ.ఐ)ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. పంజాబ్ లాంటి రాష్ట్రాలు మొదటి తరగతి నుంచే ఏ.ఐ నేర్పించాలని ఉత్సాహం చూపుతున్నాయి. కనీసం అక్షరం ముక్క రాని నర్సరీ, యుకెజి చిన్నారుల చేతుల్లో కూడా డిజిటల్ పరికరాలు పెట్టే పాఠశాలలు పుట్టుకొస్తున్నాయి. చిన్నతనంలోనే పిల్లలపై ఈ రకమైన సాంకేతికతను రుద్దడం వల్ల వారిలో సహజసిద్ధంగా అంకురించే ఆలోచనా శక్తి, సృజనాత్మకత కుంటుపడుతున్నాయి. విద్య అనేది కేవలం సమాచారాన్ని సేకరించడం కాదు, జీవితాన్ని అర్థం చేసుకోవడానికి సహాయపడే ఒక సృజనాత్మక ప్రక్రియ. కానీ నేడు మనం ఇస్తున్న డిజిటల్ విద్య పిల్లలను సృజనాత్మకతకు దూరం చేసి, కేవలం యంత్రాల మీద ఆధారపడేలా చేస్తోంది. కొన్ని సంవత్సరాల క్రితం బ్రిటన్ వంటి దేశాల్లో డిజిటల్ ఉత్సాహం ఎక్కువై పాఠశాలల్లో డిజిటల్ యాప్‌లను తప్పనిసరి చేశారు. కానీ, దాదాపు పదేళ్ల అనుభవం తర్వాత ఉపాధ్యాయులు అసలు నిజం గ్రహించారు. పిల్లలను నిజమైన పుస్తకాలకు దూరం చేయడం ఎంత పెద్ద తప్పిదమో వారికి అర్థమైంది. దీంతో చాలా పాఠశాలలు తిరిగి కాగితం, పెన్సిల్ ఆధారిత విద్యా విధానానికే మళ్లీ మళ్లుతున్నాయి. 'యతో హస్తః తతో దృష్టిః'- అంటే 'చేతో రాస్తేనే దృష్టి అక్కడ నిలుస్తుంది' అని అర్థం. రాయని చదువు నిరర్థకం అని పెద్దలు చెబుతారు. కానీ మన దేశంలో మాత్రం ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో పాఠశాలలను డిజిటలీకరించడమే గొప్ప పురోగతిగా భ్రమిస్తున్నారు. నిజమైన విద్య అంటే మనిషిలోని శారీరకమైన, మానసికమైన ఉత్తమ గుణాలను వెలికితీయడమే. కానీ నేడు స్క్రీన్ల ముందు గంటల తరబడి కూర్చోవడం వల్ల పిల్లల్లో ఏకాగ్రత లోపించడం, మానసిక ఉద్వేగాలు దెబ్బతినడం, శారీరక శ్రమ తగ్గిపోవడం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. చిన్నతనంలోనే అనేక అనారోగ్యాలకు గురవుతున్నారు. అక్షరాలు, కథలు, కవితలు, ప్రకృతితో మమేకమై ఆడుతూ, పాడుతూ పెరగాల్సిన వయస్సులో పిల్లలు యాప్‌లకు బందీలుగా మారిపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అవసరమే, కానీ అది వారి మెదడును నాశనం చేసే వయస్సులో కాదు. మానసికంగా, ఉద్వేగభరితంగా ఎదిగేందుకు వారికి ఒక 'రక్షణ కవచం' అవసరం. ఏఐ పిల్లల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలదు, కానీ తల్లిదండ్రుల ఆప్యాయత మాత్రమే వారి గాయాలను మాన్పగలదు. ఏ దేశ భవిష్యత్తు అయిన చిన్నారుల ఆరోగ్యాన్ని, వారి సహజ బాల్యాన్ని కాపాడుకోవడంపైనే ఆధారపడి వుంటుంది. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థలు, ప్రభుత్వాలు ఈ డిజిటల్ ఆక్రమణపై ఇప్పటికైనా మేల్కొనాలి. ప్రాథమిక పాఠశాలల గడపల వద్దే ఈ డిజిటల్ సునామీని నిరోధించి, చిన్నారులకు వారి సహజమైన, సంతోషకరమైన బాల్యాన్ని తిరిగి ఇవ్వాలి. పిల్లలకు కావాల్సింది తక్షణ సమాధానాలు ఇచ్చే ఆల్గారిథమ్స్ కాదు, వారి మౌనాన్ని కూడా చదవగల అమ్మనాన్నల ప్రేమ. 'మీదే, మీదే సమస్త విశ్వం/ మీరే లోకపు భాగ్య విధాతలు' అని మహాకవి శ్రీశ్రీ అన్నట్టుగా... స్వచ్ఛమైన బాల్యాన్ని అందించడం తల్లిదండ్రులతో పాటు ప్రభుత్వం బాధ్యత కూడా!!



డాక్టర్ అప్పబోయిన చక్రపాణి యాదవ్ సేవలు చిరస్మరణీయం

సంతాప సభలో బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్ నివాళులు



నిజం న్యూస్ హైదరాబాద్, నవంబర్ 15,2026: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ చైర్మన్ డాక్టర్ అప్పబోయిన చక్రపాణి యాదవ్ నవంబర్ 4 వ తేదీన ఆయన స్వగృహం జూబ్లీ హిల్స్ లో ఎమ్మెల్యే కాలనీ లో తుది శ్వాస విడిచారు. ఆదివారం హైదరాబాదులోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జరిగిన సంతాప సభ కు రెండు రాష్ట్రాల నుంచి పలువురు నాయకులు హాజరు అయ్యారు. శాసన మండలి చైర్మన్ గా , సభ వ్యవహారాల నిర్వహణ లో పార్లమెంటరీ సంప్రదాయాల పరిరక్షణలో ఆయన చేసిన సేవలను వివిధ పార్టీల నేతలు గుర్తు తెచ్చుకున్నారు. ఆయన యొక్క మార్గదర్శకాలు ఇప్పటి నాయకులు అలవరుచుకోవాలి అని పలువురు నేతలు మాట్లాడారు. తెలంగాణ బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్ డాక్టర్ చక్రపాణి తో వున్న మధుర క్షణాలు గుర్తుంచేసుకుంటూ బడుగు బలహీనవర్గాలకు మరియు యాదవులకు ఆయన చేసిన సేవలు గుర్తు చేశారు. దాదాపు ఐదు దశాబ్దాల ప్రజా జీవితంలో అంకిత భావంతో ఆయన చేసిన ఎన్నో సేవలను గుర్తు చేస్తూ చక్రపాణి ఆత్మ కు శాంతి కలగాలనీ కోరుకుంటూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే , జాతీయ కమ్యూనిస్ట్ పార్టీ సెక్రటరీ రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే జాతీయ సెక్రటరీ పల్లా వెంకట రెడ్డి, కొత్త గూడెం ఎమ్మెల్యే కె. సాంబశివరావు, ఎమ్మెల్సీ సత్యం, మెదక్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ సెక్రటరీ వీర్ల ప్రకాశ్, జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు కుమార స్వామి, టెక్నోక్రాఫ్ట్, ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ ప్రొవైడర్ బొబ్బిలి రాజా యాదవ్, డా. చక్రపాణి యాదవ్ కుటుంబ సభ్యులతో తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్య వేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ గారు మరియు సీనియర్ కాంగ్రెస్ లింగంపల్లి కి చెందిన కుమార్ యాదవ్, కెపిహెచ్బి అల్లం వెంకటేశ్వర్లు, వెంకట రమణ యాదవ్, బీసీ కులాల రాష్ట్ర ఉపాధ్యక్షులు పాములేటి యాదవ్, నందగోపాల్ యాదవ్, నందకిషోర్ యాదవ్, వేణుగోపాల్ యాదవ్, బసవరాజు యాదవ్, ఉన్నారు. ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో అన్ని పార్టీల నాయకులు , యాదవ బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

వందనపురి కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పాదయాత్ర నిర్వహించి అభివృద్ధి పనులను పరిశీలించిన శశిధర్ రెడ్డి



నిజం న్యూస్ బీరంగూడ హైదరాబాద్, నవంబర్ 15,2026: అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ డివిజన్ వందనపురి కాలనీ రోడ్ నో- 3 లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి కాలనీలో పాదయాత్ర నిర్వహించి ప్రారంభమైన అభివృద్ధి పనులను పరిశీలించారు. పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ సహకారంతో డివిజన్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాదయాత్ర సందర్భంగా స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను కాటా శ్రీనివాస్ గౌడ్‌తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని శశిధర్ రెడ్డి తెలిపారు. దీనిలో కాలనీ వాసులు మనోహర్, కృష్ణ యాదవ్,ఎశ్రీ శ్రీనివాస్, శ్రీధర్, ఈశ్వర్ రెడ్డి, రాములు, శ్రీమాన్ నారాయణ, ప్రభాకర్, ప్రకాష్,తదితరులు పాలుగొనరు.

ప్రకృతి ఆరాధనకు, త్యాగానికి ప్రతీక ఛత్ పూజ: రవికుమార్ యాదవ్



నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, నవంబర్ 15,2026: ఎంతో భక్తిశ్రద్ధలతో, పవిత్రంగా జరుపుకుంటున్న మహా పర్వదినం ఛత్ పూజా వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. రాయదుర్గంలోని మల్కం చెరువు వద్ద నిర్వహించిన ఈ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్య భగవానుడిని, షష్ఠీ దేవిని (ఛఠీ మాతను) ఆరాధించే ఈ మహోత్సవం మన సంస్కృతికి, ప్రకృతి ఆరాధనకు ఒక గొప్ప ప్రతీక అని కొనియాడారు. మన జీవితానికి ఆధారమైన సూర్యదేవునికి కేవలం వెలుగునిచ్చినందుకు మాత్రమే కాకుండా, సమస్త జీవకోటికి ప్రాణాధారంగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపే ఏకైక పండుగ ఛత్ పూజ అని ఆయన పేర్కొన్నారు. ఈ కఠినమైన ఉపవాస దీక్షలను ఆచరిస్తూ, ప్రకృతిని, నదులను, సూర్య భగవానుడిని భక్తితో కొలిచే తల్లుల మరియు సోదరీమణుల త్యాగానికి, నిబద్ధతకు ప్రతి ఒక్కరం తలవంచాల్సిందేనని అన్నారు. ఈ పవిత్రమైన పండుగ ప్రజలందరి జీవితాల్లో ఆయురారోగ్యాలను, ఐశ్వర్యాన్ని, సుఖశాంతులను నింపాలని, సమాజంలో భాతృభావం మరింత వర్ధిల్లాలని ఆయన మనసారా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్,శివ సింగ్ అమరయాదవ్ , అశోక్ ,రాజేశ్వర్, శ్యామ్ యాదవ్ , రవి ముదిరాజ్, రాజు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యూజిలాండ్‌పై వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్



నిజం న్యూస్ హైదరాబాద్, నవంబర్ 15,2026: మౌంట్ మాంగనుయ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన ఐదో మరియు చివరి వన్డే మ్యాచ్‌లో టీమ్ ఇండియా 22 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈ గెలుపుతో 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 3-1 తేడాతో కైవసం చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని భారత జట్టు 42.1 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌట్ అయింది. అక్షర్ పటేల్ (46), ఇషాన్ కిషన్ (46) రాణించడంతో భారత్ గౌరవప్రదమైన స్కోరు సాధించింది. అనంతరం 210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌ను భారత బౌలర్లు కట్టడి చేశారు. అర్ష్‌దీప్ సింగ్ (3/30), మహమ్మద్ సిరాజ్ (2/50), అక్షర్ పటేల్ (2/28) కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో కివీస్ జట్టు 48.1 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌట్ అయింది.

ఐపీఎస్ అధికారి రాజీవ్ హనుమంతు కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురి





నిజం న్యూస్ హైదరాబాద్, నవంబర్ 15,2026: అనంతసాగరం, నెల్లూరు జిల్లా: తెలంగాణ ఐఏఎస్ అధికారి రాజీవ్ హనుమంతు కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల నుంచి శ్రీశైలం వెళ్తుండగా, అనంతసాగరం మండలం చాపరాళ్లపల్లి వద్ద వారి కారు స్కూల్ వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో హనుమంతు, ఆయన కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను తొలుత ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆసుపత్రికి వెళ్లి హనుమంతును పరామర్శించారు.

భక్తిశ్రద్ధలతో ఛట్ పూజా వేడుకలు

నల్లగండ్ల చెరువు కట్టపై ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ





హైదరాబాద్ నవంబర్ 15 నిజం న్యూస్ గచ్చిబౌలి: ఉత్తర భారతీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్ర ఛట్ పూజా వేడుకలు గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల చెరువు కట్టపై ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమానికి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, మంత్రిప్రగడ సత్యనారాయణతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి సూర్య భగవానుడికి అర్ఘ్యం సమర్పించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ఛట్ పూజ అనేది ఉదయించే సూర్యుడితో పాటు అస్తమించే సూర్యుడిని సైతం పూజించే విశిష్టమైన పండుగ అని తెలిపారు. సాయంత్రం వేళ పెద్ద సంఖ్యలో భక్తులు చెరువులు, నదీ తీరాలకు చేరుకుని అస్తమించే సూర్యుడికి అర్ఘ్యం సమర్పించడం ఈ పండుగలో ప్రత్యేకత అని పేర్కొన్నారు. కార్తీక మాసంలోని శుక్ల పక్ష షష్ఠి రోజున జరుపుకునే ఈ పండుగను సూర్య షష్ఠి అని కూడా పిలుస్తారని తెలిపారు. నాలుగు రోజులపాటు వ్రతాలు, ఉపవాస దీక్షలు, పవిత్ర ఆచారాలతో భక్తులు ఎంతో నిష్ఠగా ఈ వేడుకలను నిర్వహించుకుంటారని వివరించారు. సూర్య భగవానుడు, ఛఠీ మాతకు అంకితం చేసిన ఈ పవిత్ర పండుగ ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే గొప్ప ఆధ్యాత్మిక వేడుక అని అన్నారు. ఇలాంటి పండుగలు భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించే ఐక్యతా భావాన్ని చాటుతాయని పేర్కొన్నారు. సూర్య భగవానుడి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఉత్తర భారతీయ కుటుంబాల సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్

సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యత

కమ్మ సంఘం 30వ కార్తీక మాస వనభోజన మహోత్సవంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ







హైదరాబాద్ నవంబర్ 15(నిజం న్యూస్) మియాపూర్: సంప్రదాయాలు, సంస్కృతి, ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని నరేన్ గార్డెన్స్‌లో కమ్మ సంఘం పటాన్‌చెరు, బీహెచ్ఈఎల్, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన 30వ కార్తీక మాస వనభోజన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సతీష్ కుమార్, లయన్ ఘట్టమనేని బాబురావు, సీనియర్ నాయకులు మొవ్వ సత్యనారాయణ, ప్రైమ్ మార్క్ అధినేత సాంబశివరావు, డీసీలు బాలకృష్ణ, తాన్య, మాజీ కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ఐదు ప్రాంతాలకు చెందిన కమ్మ సంఘాల ఆధ్వర్యంలో 30వ కార్తీక మాస వనభోజన మహోత్సవాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్తీక మాసంలో ఉసిరి చెట్టు నీడన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వనభోజనాలు చేయడం మన సంప్రదాయంలో ప్రత్యేకమైన ఆచారమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తాయని తెలిపారు. వనభోజనాల వెనుక ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణ అనే గొప్ప సందేశం దాగి ఉందన్నారు. ప్రకృతిని కాపాడుకుంటే ప్రకృతి మనల్ని కాపాడుతుందని, చెట్లు, వృక్ష సంపదను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల వల్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య సాన్నిహిత్యం పెరుగుతుందని, పరస్పర సహకారం, ఐక్యత, సంబంధ బాంధవ్యాలు మరింత బలపడతాయని గాంధీ అన్నారు. సంప్రదాయాలను కొనసాగిస్తూ భావితరాలకు మన సంస్కృతిని పరిచయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ వనభోజన మహోత్సవంలో కమ్మ సంఘం ప్రతినిధులు, సభ్యులు, కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.

అంబేద్కర్ ఆశయాల సాధనకు బలహీన వర్గాల ఐక్యత అవసరం

బలహీన వర్గాలన్నీ ఐక్యంగా ఉండాలి.. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా: పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ





హైదరాబాద్ నవంబర్ 15(నిజం న్యూస్) బాలానగర్: బలహీన వర్గాలను విడదీసేందుకు కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని, ఎన్ని ప్రయత్నాలు జరిగినా ఆయా వర్గాలన్నీ ఐక్యంగా ఉండాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పెన్షన్ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బాలానగర్‌లో ప్రపంచ మేధావి, భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎంపీ వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలానగర్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎక్కడ అంబేద్కర్ విగ్రహావిష్కరణ జరిగినా తాను ఎందుకు హాజరవుతున్నానని చాలామంది ప్రశ్నిస్తుంటారని, అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాల పట్ల తనకున్న గౌరవం, నిబద్ధతే అందుకు కారణమని స్పష్టం చేశారు. అంబేద్కర్ విషయంలో మంత్రి వివేక్ వెంకటస్వామి ఎప్పుడూ వెనుకడుగు వేయరని పేర్కొన్నారు. తన తాత, తండ్రి చూపిన మార్గంలోనే తాను ముందుకు సాగుతున్నానని తెలిపారు. గిగ్ వర్కర్ల హక్కుల కోసం మంత్రి వివేక్ వెంకటస్వామి ఎంతో కృషి చేశారని, రాహుల్ గాంధీ నాయకత్వంలో వారికి చట్టబద్ధమైన రక్షణ కల్పించే దిశగా ప్రయత్నాలు జరిగాయని గుర్తుచేశారు. ప్రైవేటు రంగ కార్మికులకు పీఎఫ్ సౌకర్యం కల్పించడంలో తన తాత కాకా చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. మహిళల ఆత్మగౌరవం, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం అంబేద్కర్ చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. దశాబ్దాల క్రితమే సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతిపై దూరదృష్టితో ఆలోచించి, రాజ్యాంగంలో సమానత్వానికి పెద్దపీట వేశారని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 21, 22 పౌరుల హక్కులకు రక్షణ కల్పిస్తున్నాయని వివరించారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రతి ఒక్కరినీ సమానంగా చూడాలని, బలహీన వర్గాల పట్ల ఎలాంటి వివక్షకు తావివ్వకూడదని సూచించారు. ఇటీవల పలువురు రిటైర్డ్ ఉద్యోగులు తనను కలిసి పెన్షన్ సమస్యలను వివరించారని, వారి సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ వంశీకృష్ణ భరోసా ఇచ్చారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

వినియోగదారులకు చేకూరని జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం

తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు శంకర్ లాల్ చౌరసియా



నిజం న్యూస్ ప్రతినిధి, నవంబర్ 15, షాద్ నగర్: కేంద్ర ప్రభుత్వం 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పలు రకాల వస్తువులపై 18% మరియు12% శాతం నుండి 5% నకు తగ్గించడం జరిగిందని, అలాగే ఆహార పదార్థాలు నిత్యావసరాలు నమకీన్, భుజియా, సాస్‌లు, పాస్తా, ఇన్‌స్టంట్ నూడుల్స్, చాక్లెట్లు, కాఫీ, కార్న్‌ఫ్లేక్స్, వెన్న, నెయ్యి వంటి వాటిపై జీఎస్టీని 12% లేదా 18% నుంచి 5% కి తగ్గించినప్పటికీ వ్యాపారస్తులు దాన్ని ఎక్కడ అమలు చేయడం లేదని తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు శంకర్ లాల్ చౌరసియా ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ఓ పత్రిక ప్రకటనలో పేర్కొంటూ... పాలు, పాల ఉత్పత్తులు అల్ట్రా-హై టెంపరేచర్ పాలు, పనీర్‌లపై జీఎస్టీని 5% నుంచి సున్నా (0%) కి తగ్గించారని, అన్ని రకాల ఇండియన్ బ్రెడ్‌లపై కూడా జీఎస్టీని పూర్తిగా ఎత్తివేశారని గుర్తు చేశారు. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు ఎయిర్ కండిషనర్లు, డిష్ వాషింగ్ యంత్రాలు, 32 అంగుళాల కంటే ఎక్కువ పరిమాణం ఉన్న టీవీలతో పాటు అన్ని రకాల టీవీలపై జీఎస్టీని 28% నుంచి 18% కి తగ్గించారన్నారు. వాహనాలు, ఆటో విడిభాగాలు,చిన్న కార్లు 350 సీసీ వరకు ఉన్న మోటార్ సైకిళ్లు, త్రిచక్ర వాహనాలు బస్సులు, ట్రక్కులు, అంబులెన్స్‌లపై జీఎస్టీని 28% నుంచి 18% కి తగ్గించారన్నారు. అన్ని రకాల ఆటో స్పేర్ పార్ట్స్‌పై కూడా 18% యూనిఫాం రేటును అమలు చేశారు. వ్యవసాయ పరికరాలు వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల పరికరాలపై జీఎస్టీని 12% నుండి 5% కి తగ్గించారని పేర్కొన్నారు. వైద్యం క్యాన్సర్ మరియు అరుదైన వ్యాధుల చికిత్సకు ఉపయోగించే కొన్ని మందులపై జీఎస్టీని 12% నుండి 5% కి తగ్గించగా, 33 రకాల ప్రాణరక్షక మందులపై జీఎస్టీని పూర్తిగా సున్నా చేశారని, అయినప్పటికీ వ్యాపారులు తమ ధోరణిని మార్చుకోకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. మార్కెట్లో పాత ఎమ్మార్పీ ప్రకారమే అనేక రకాల వస్తువులు మార్కెట్లో విక్రయించబడుతున్నాయని గుర్తు చేశారు. కొన్ని పదార్థాలు వస్తువులు బంగారం కంటే మిన్న గా మారిందని, హోటళ్లలో ఇడ్లీ, దోశ, వడల, సైజు రోజు రోజుకు తగ్గిపోతుందని, ఈ విషయంలో సంబంధిత అధికారులు చట్టబద్ధంగా చర్యలు తీసుకొని సరియైన ధరతో సరియైన సరుకులు వినియోగదారులకు అందేలాగా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు

జనసేనలోకి భారీగా యువత చేరిక

ప్రేమ్ గాంధీ ఆధ్వర్యంలో 70 మందికి పైగా యువత, ఐటీ నిపుణులు, విద్యావంతుల చేరిక





హైదరాబాద్ నవంబర్ 15 (నిజం న్యూస్) హైదరాబాద్: జనసేన పార్టీ సిద్ధాంతాలు, అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నాయకత్వంపై ఆకర్షితులై వివిధ రంగాలకు చెందిన యువత, విద్యావంతులు, ఐటీ నిపుణులు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరారు. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, జాయినింగ్ కమిటీ సభ్యుడు ప్రేమ్ గాంధీ ఆధ్వర్యంలో 70 మందికి పైగా ఆదివారం జనసేనలో చేరారు. హైదరాబాద్‌లోని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ఈ చేరికల కార్యక్రమం పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్, తెలంగాణ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వారికి పార్టీ నాయకులు సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా రామ్ తాళ్లూరి మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న జనసేన పార్టీ, అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నాయకత్వం, ఆశయాలు, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత దేశవ్యాప్తంగా ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. వివిధ పార్టీల నుంచి నాయకులు, యువత పెద్ద సంఖ్యలో జనసేనలో చేరడం పార్టీ సిద్ధాంతాలపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే నాయకులకు, యువతకు, సామాజిక సేవ పట్ల ఆసక్తి ఉన్నవారికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ స్వాగతం పలుకుతుందని తెలిపారు. సమాజంలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో యువత రాజకీయాల్లోకి రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంతోష్ నాయక్, బండి నరేష్, మండపాక కావ్య, తాడికొండ లిఖిత తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఛత్ పూజ మహోత్సవాలు

వేడుకల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి





హైదరాబాద్ నవంబర్ 15 నిజం న్యూస్ కుత్బుల్లాపూర్: నియోజకవర్గ పరిధిలో ఛత్ పూజ మహోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వెన్నెలగడ్డలో ఛత్ పూజా యువ సమితి, ఎం.ఎన్. రెడ్డి నగర్‌లో ఛత్ పూజా సేవా సంఘ్, సుభాష్ నగర్‌లోని ఫాక్స్ సాగర్ చెరువు వద్ద ఛత్ పూజా సేవా సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు నియమనిష్ఠలతో ఉపవాస దీక్షలు చేపట్టి సూర్య భగవానుడికి సాయంత్రం అస్తమయ సమయంలో, మరుసటి రోజు ఉదయం సూర్యోదయ సమయంలో అర్ఘ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకృతి ఆరాధనకు, సూర్య భగవానుడి పూజకు ప్రతీకగా నిలిచే ఛత్ పండుగను భక్తులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భరత్ సింహారెడ్డి మాట్లాడుతూ ఛత్ పూజా సంఘాల నిర్వాహకులకు, భక్తులందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సూర్య భగవానుడు, ఛత్తీ మాత ఆశీస్సులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో ఛత్ పూజ.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆరెకపూడి గాంధీ

సూర్య భగవానుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలి: పీఏసీ చైర్మన్





హైదరాబాద్ నవంబర్ 15 నిజం న్యూస్ చందానగర్: ఉత్తర భారతీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్ర ఛట్ పూజా వేడుకలు చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం చెరువు కట్టపై ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, తాజా మాజీ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ఛట్ పూజ అనేది ఉదయించే సూర్యుడితో పాటు అస్తమించే సూర్యుడిని సైతం పూజించే విశిష్టమైన పండుగ అని తెలిపారు. సాయంత్రం వేళ పెద్ద సంఖ్యలో భక్తులు నదీ తీరాలు, చెరువుల వద్దకు చేరుకుని అస్తమించే సూర్య భగవానుడికి అర్ఘ్యం సమర్పించి భక్తిని చాటుకుంటారని పేర్కొన్నారు. కార్తీక మాసంలోని శుక్ల పక్ష షష్ఠి రోజున నిర్వహించే ఈ పండుగను సూర్య షష్ఠి అని కూడా పిలుస్తారని తెలిపారు. నాలుగు రోజులపాటు ఉపవాస దీక్షలు, పవిత్ర ఆచారాలు, ప్రత్యేక పూజలతో భక్తులు ఈ పండుగను ఎంతో నిష్ఠతో జరుపుకుంటారని వివరించారు. సూర్య భగవానుడు, ఛఠీ మాతకు అంకితం చేసిన ఈ పండుగ ఉత్తర భారతీయుల ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే గొప్ప ఆధ్యాత్మిక వేడుక ఛట్ పూజ అని పేర్కొన్నారు. సూర్య భగవానుడి కృపతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నరేందర్ బల్ల, భవానీ, రాహుల్, పార్టీ కార్యకర్తలు, ఉత్తర భారతీయ కుటుంబాల సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

" ప్రజా సేవే లక్ష్యం -- ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యం "

మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



నిజం న్యూస్ ప్రతినిధి,మేడిపల్లి నవంబర్ 15: మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ విహారిక కాలనీలో మాజీ కార్పొరేటర్ లిదొంతిరి హరిశంకర్ రెడ్డి వారి ఆధ్వర్యంలో, నీలిమ ఆసుపత్రి (జోడిమెట్ల) వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పీర్జాదిగూడ మాజీ మేయర్ లిలిజక్క వెంకట్ రెడ్డి లి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం ద్వారా ఆరోగ్యంపై అవగాహన కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషకరమని తెలిపారు.

వైద్య శిబిరంలో అందించిన సేవలు: ఉచిత వైద్య పరీక్షలు అవసరమైన మందుల పంపిణీ అనుభవజ్ఞులైన వైద్యుల ఆరోగ్య సలహాలు, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, నాయకులు, నీలిమ ఆసుపత్రి వైద్య బృందం, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డి



నిజం న్యూస్ ప్రతినిధి, మేడిపల్లి : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మేడిపల్లిలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నిర్వహించిన లిబాలల దినోత్సవ వేడుకలకులి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లిమేడిపల్లి మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి లి హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థులతో ముచ్చటించి, వారి భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు. పిల్లలే దేశ భవిష్యత్తు అని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదల, విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని ప్రోత్సహించడం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా సురక్ష క్లినిక్ ప్రారంభోత్సవం

ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ అజయ్ యాదవ్





నిజం న్యూస్ ప్రతినిధి,మేడిపల్లి, నవంబర్ 15 : బోడుప్పల్ డివిజన్ పరిధిలోని చిలుకానగర్ మెయిన్ రోడ్డులో సురక్ష క్లినిక్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జంగా రెడ్డి , కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి హరినాథ్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రవి యాదవ్ , పోకల రవి , సురక్ష క్లినిక్ సభ్యులు కూడా ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురక్ష క్లినిక్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, స్థానిక ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

మాక్‌డోవెల్ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభం

మాజీ మేయర్ అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ బొమ్మక్ బాలయ్య చేతుల మీదుగా ప్రారంభోత్సవం



నిజం న్యూస్ ప్రతినిధి,మేడిపల్లి,నవంబర్ 15 : బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బోడుప్పల్ డివిజన్ మాక్‌డోవెల్ కాలనీలో సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ బొమ్మక్ బాలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ, కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలకు అవసరమైన కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కమ్యూనిటీ హాల్ కాలనీ ప్రజలకు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ జనరల్ సెక్రటరీ కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బి. కళ్యాణ్, ఉపాధ్యక్షుడు పి. రవి, కాలనీ అధ్యక్షులు, కాలనీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాలి

బాలల దినోత్సవ శుభాకాంక్షలు

విజయవంతంగా 404వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల

ప్రభుత్వాలు విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

బడుగు బలహీన వర్గాల ప్రజలు తమ పిల్లలను చదివించాలి

అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నత్తి మైసయ్య



నిజం న్యూస్ ప్రతినిధి,మేడిపల్లి, నవంబర్ 15 : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 404వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ, నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి బడుగు బలహీన వర్గాలు, దళిత,బహుజనులు తమ పిల్లలను తప్పకుండా చదివించాలని, ఈ ప్రపంచంలో మన తలరాతను మార్చే ఒకే ఒక ఆయుధం చదువు అని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించే సమాజానికి ఉత్తమ పౌరులను అందించాలని నత్తి మైసయ్యవిజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తరగతి గదిలోనే సమాజ నిర్మాణం జరుగుతుందని పెద్దలు చెప్పినట్లు గురువులు అంకితభావంతో అత్యుత్తమ విద్యను అందించాలని ఆయన సూచించారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్య రంగాన్ని మరింత బలోపేతం చేయాలని, మారుమూల పల్లెలో కూడా విద్యార్థులకు సరైన వసతులు కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నిర్మించి బడ్జెట్లో విద్య రంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, బోడుప్పల్ అరుంధతి మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గరుగుల యాకయ్య,చిల్ల అంజయ్య, మల్లేష్, గుంజే శ్రీనివాస్, కంచి సతీష్ తదితరులు పాల్గొన్నారు ?

ఎన్టీఆర్ నగర్, తాజ్ నగర్ తాగునీటి సమస్యకు పరిష్కారం

బోర్‌వెల్ ఏర్పాటు చేసి నీటి సరఫరా ప్రారంభించిన కొమిరిశెట్టి సాయిబాబా, రాగం హరిశంకర్ యాదవ్





హైదరాబాద్ నవంబర్ 15 నిజం న్యూస్ నల్లగండ్ల: తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న ఎన్టీఆర్ నగర్, తాజ్ నగర్ కాలనీ ప్రజలకు ఎట్టకేలకు ఊరట లభించింది. నల్లగండ్ల డివిజన్ పరిధిలోని ఈ ప్రాంతాల్లో స్థానికులు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను గుర్తించిన శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రాగం హరిశంకర్ యాదవ్ చొరవ తీసుకుని కాలనీలో నూతన బోర్‌వెల్ ఏర్పాటు చేయించారు. ఈ మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను ప్రారంభించి నీటిని విడుదల చేశారు. దీంతో కాలనీ ప్రజలకు తాగునీటి సదుపాయం అందుబాటులోకి వచ్చింది. చాలాకాలంగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు బోర్‌వెల్ ఏర్పాటు చేయించి సమస్య పరిష్కారానికి కృషి చేసిన నాయకులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నాయకులు ముందుకు రావడం అభినందనీయమని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. తమకు తాగునీటి సౌకర్యం కల్పించిన కొమిరిశెట్టి సాయిబాబా, రాగం హరిశంకర్ యాదవ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్ నాయక్, మోహన్ నాయక్, ఎం. శంకర్, ఎం. హిరియా, ఎం. రాజు, ఎం. రవి, ఎం. జంపా, లోకేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో ముందుకు సాగాలి

సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్





హైదరాబాద్ నవంబర్ 15 నిజం న్యూస్ కుత్బుల్లాపూర్: కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ప్రేమాభిమానాలు, సోదరభావం, ఐకమత్యంతో కలిసిమెలిసి జీవించాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ పిలుపునిచ్చారు. షాపూర్‌నగర్‌లోని హెచ్ఎంటీ కాలనీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని హరిహర కళాభవన్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ శెట్టి బలిజ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనభోజన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన శెట్టి బలిజ కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఇంతటి భారీ స్థాయిలో కార్తీక వనభోజన మహోత్సవాన్ని నిర్వహిస్తూ కులస్తులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, పరస్పర అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. కులాలు, మతాలు వేరైనా మనుషులుగా అందరం ఒక్కటేనని, పరస్పర గౌరవం, ప్రేమాభిమానాలతో జీవించాలని సూచించారు. సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఐక్యతా భావంతో ముందుకు సాగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. శెట్టి బలిజ సంఘం అభ్యున్నతికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్తీక వనభోజన మహోత్సవం ద్వారా కులస్తులందరూ ఒకచోట చేరి ఆత్మీయంగా కలుసుకోవడం సంతోషకరమని, భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శెట్టి బలిజ సంఘం నాయకులు గుబ్బల రమణ, శ్రీనివాస్, సత్యనారాయణ, సింహాచలం, సుబ్రహ్మణ్యం, వీర్శెట్టి, సాగర్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో సంఘం సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఛట్ పూజ వేడుకలు

ప్రకృతి ఆరాధనకు ప్రతీక ఛట్ పూజ.. అన్ని ప్రాంతాల ప్రజలు ఐకమత్యంతో ఉండాలి: బండి రమేష్





హైదరాబాద్ నవంబర్ 15 నిజం న్యూస్ ఫతేనగర్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకలని, అన్ని మతాలు, కులాలు, ప్రాంతాలకు చెందిన ప్రజలు సోదరభావంతో, ఐకమత్యంతో కలిసి మెలిసి జీవించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఫతేనగర్ డివిజన్‌లోని శివాలయం సమీపంలో బిహారీ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన పవిత్ర ఛట్ పూజ వేడుకలకు బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి పూజలు నిర్వహించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఛట్ పూజ ప్రకృతి ఆరాధనకు, సూర్య భగవానుడిపై భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ తమ ఆచారాలు, సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను జరుపుకోవడం భారతీయ సంస్కృతిలోని గొప్ప ప్రత్యేకత అని అన్నారు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన ప్రజలంతా పరస్పర గౌరవం, ప్రేమాభిమానాలతో కలిసి జీవించాలని ఆకాంక్షించారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఛట్ పూజ సందర్భంగా ప్రతి ఒక్కరి కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని కోరుకుంటూ భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రాంతి, సూరజ్ తివారి, లక్ష్మయ్య, ఇజాజ్, నరసింహ, శ్రవణ్, ఎల్. నర్సింగ్, కిరణ్, తమిళ్, రవి తదితరులు పాల్గొన్నారు.

షుగర్ ఉన్నవారికి దాల్చినచెక్క మంచిదేనా? డాక్టర్ దీక్షా చెప్పిన వాడే విధానం ఇదే!



మధుమేహం నెమ్మదించిన మెటబాలిజం సమస్యలతో బాధపడేవారికి మన వంటింట్లో లభించే దాల్చినచెక్క ఒక అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుంది. ప్రముఖ ఆయుర్వేద నిపుణులు డాక్టర్ దీక్షా భావ్‌సార్ ప్రకారం.. దాల్చినచెక్కను సరైన పద్ధతిలో క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉండటమే కాకుండా జీర్ణశక్తి, మెటబాలిజం గణనీయంగా మెరుగుపడతాయి. దాల్చినచెక్క రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో, మెటబాలిజాన్ని పెంచడంలో అత్యంత సమర్థవంతంగా పనిచేస్తుందని ఆయుర్వేద నిపుణులు డాక్టర్ దీక్షా భావ్‌సార్ వెల్లడించారు. దాల్చినచెక్కలోని ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచే గుణాలు మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలు చేస్తాయి. అయితే దీనిని సరైన పద్ధతిలో తీసుకోవడం చాలా ముఖ్యం అంటున్నారు. అది ఎలాగో ఇప్పుడు చూద్దాం..

షుగర్ లెవెల్స్ ఎలా తగ్గుతాయి?

దాల్చినచెక్కలో ఉండే సహజసిద్ధమైన సమ్మేళనాలు శరీరంలో ఇన్సులిన్ హార్మోన్ పనితీరును ప్రేరేపిస్తాయి. దీనివల్ల కణాలు గ్లూకోజ్‌ను వేగంగా గ్రహిస్తాయి. ఫలితంగా భోజనం చేసిన తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు ఆకస్మికంగా పెరగకుండా నియంత్రణలో ఉంటాయి.

మెటబాలిజం, బరువు నియంత్రణ

దాల్చినచెక్క శరీరంలో వేడిని ఉత్పత్తి చేసే గుణాన్ని కలిగి ఉంటుంది. ఇది మందగించిన జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యలు తగ్గడమే కాకుండా, శరీరంలో పేరుకుపోయిన మొండి కొవ్వు కరిగి బరువు తగ్గడం సులువవుతుంది.

ఎలా ఉపయోగించాలి?

దాల్చినచెక్కను నేరుగా ఎక్కువగా తీసుకోకూడదు. దీనిని చిన్న మోతాదులో మాత్రమే వాడాలి:

దాల్చినచెక్క నీరు/టీ: ఒక చిన్న దాల్చినచెక్క ముక్కను (లేదా పావు టీస్పూన్ పొడిని) ఒక గ్లాసు నీటిలో వేసి 5 నిమిషాల పాటు మరిగించాలి. ఈ నీటిని గోరువెచ్చగా ఉన్నప్పుడు ఉదయాన్నే లేదా భోజనానికి అరగంట ముందు తాగాలి. మీరు రోజువారీగా తాగే హెర్బల్ టీ లేదా ఫ్రూట్ స్మూథీలలో చిటికెడు దాల్చినచెక్క పొడిని చల్లుకుని తీసుకోవచ్చు.

ఎవరు జాగ్రత్తగా ఉండాలి?

దాల్చినచెక్క ఆరోగ్యానికి ఎంతో మంచిదైనప్పటికీ, కాలేయ సమస్యలు ఉన్నవారు లేదా తీవ్రమైన హైపోగ్లైసీమియా (చక్కెర స్థాయిలు చాలా తక్కువగా ఉండటం) ఉన్నవారు వైద్యుల సలహా మేరకు మాత్రమే దీనిని ఉపయోగించాలి. అలాగే రోజూ 1-2 గ్రాముల కంటే ఎక్కువ మోతాదులో తీసుకోకూడదు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో పాటు దాల్చినచెక్కను భాగం చేసుకోవడం వల్ల సహజ సిద్ధంగా డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు.

సోషల్ మీడియాను మీరు అతిగా వాడుతున్నారా? వామ్మో.. ఇది తెలిస్తే వెన్నులో వణుకే..

సోషల్ మీడియాలో లైక్‌లు, వ్యూస్, కామెంట్ల కోసం ఎక్కువగా ఎదురుచూస్తున్నారా? ఈ అలవాటు ఆత్మవిశ్వాసం, నిద్ర, మానసిక ప్రశాంతతపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? సోషల్ మీడియా వ్యామోహం నుంచి బయటపడటానికి నిపుణులు సూచిస్తున్న ముఖ్యమైన విషయాలు తెలుసుకోండి. ప్రతి సంవత్సరం అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తారు. మానసిక ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి అండగా నిలవడం ఈ రోజు ప్రధాన ఉద్దేశం. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న పని ఒత్తిడి, స్మార్ట్‌ఫోన్ల వినియోగం ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాకు అలవాటు పడిన యువత, టీనేజర్లు, పిల్లల్లో మానసిక ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలపై ఆందోళన పెరుగుతోంది. చిన్న వీడియోలు చూడటం, రీల్స్‌ను స్క్రోల్ చేయడం, ఫొటోలు పోస్టు చేయడం, వాటికి ఎన్ని లైక్‌లు వచ్చాయో పదేపదే తనిఖీ చేయడం చాలామందికి నిత్యకృత్యంగా మారింది. సోషల్ మీడియాలో ఎక్కువ మంది ఫాలోవర్లను సంపాదించాలనే కోరికతో కొందరు నిరంతరం కొత్త కంటెంట్‌ను రూపొందిస్తున్నారు. అయితే, లైక్‌లు, వ్యూస్, కామెంట్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఆత్మవిశ్వాసం తగ్గడం, ఇతరులతో పోల్చుకోవడం, ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

లైక్‌లు, ఫాలోవర్ల కోసం ఆరాటం.. ఆత్మవిశ్వాసంపై ప్రభావం

న్యూఢిల్లీలోని మోడల్ టౌన్‌లో ఉన్న యథార్థ్ హాస్పిటల్‌కు చెందిన సీనియర్ కన్సల్టెంట్ సైకాలజిస్ట్ రిచా అగర్వాల్ అభిప్రాయం ప్రకారం, ప్రస్తుతం చాలామంది యువత సోషల్ మీడియాలో ఎక్కువ లైక్‌లు, కామెంట్లు, ఫాలోవర్లను పొందాలని కోరుకుంటున్నారు. అయితే, తాము పెట్టిన పోస్టులకు ఆశించిన స్థాయిలో స్పందన రాకపోతే కొందరు నిరాశకు గురవుతున్నారు. ఇతరుల పోస్టులతో తమను పోల్చుకుంటూ, తమకు తగిన గుర్తింపు లభించడం లేదని భావిస్తున్నారు. ఇలాంటి ఆలోచనలు క్రమంగా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయవచ్చు. ఫొటోలు లేదా వీడియోలు పోస్టు చేసిన తర్వాత ఇతరుల స్పందన కోసం పదేపదే ఫోన్ చూడటం కూడా ఒత్తిడి, ఆందోళనకు కారణమవుతుంది. ఈ అలవాటు నిద్రకు అంతరాయం కలిగించడంతో పాటు రోజువారీ పనులపై ఏకాగ్రతను తగ్గించే అవకాశం ఉంది.

ప్రతికూల కామెంట్లు.. మనసుపై చెరగని ప్రభావం

సోషల్ మీడియాలో ఏదైనా ఫొటో లేదా వీడియోను పోస్టు చేసిన తర్వాత ఎన్ని లైక్‌లు వచ్చాయి? ఎవరు కామెంట్ చేశారు? అనే విషయాలను తెలుసుకోవడానికి చాలామంది ఆసక్తి చూపుతారు. అయితే, ప్రతి ఒక్కరి నుంచి సానుకూల స్పందనే వస్తుందని చెప్పలేం. కొన్నిసార్లు విమర్శలు, అవమానకరమైన వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు ఎదురవుతాయి. ముఖ్యంగా టీనేజర్లు, యువత ఇలాంటి వ్యాఖ్యలను వ్యక్తిగతంగా తీసుకునే అవకాశం ఉంది. ఇతరులు ఏమనుకుంటారనే ఆందోళనతో బాధపడటం, తమ రూపం లేదా సామర్థ్యాలపై అనుమానం పెంచుకోవడం వంటి పరిణామాలు ఎదురుకావచ్చు. అందువల్ల సోషల్ మీడియాలో వచ్చే ప్రతి వ్యాఖ్యను తమ వ్యక్తిగత విలువకు కొలమానంగా భావించకూడదు.

సైబర్‌బుల్లింగ్‌తో జాగ్రత్త..

ఆన్‌లైన్ వేధింపులు ప్రమాదకరం

సోషల్ మీడియాలో నకిలీ ఖాతాల ద్వారా వేధించడం, అసత్య ప్రచారాలు చేయడం, బెదిరింపు సందేశాలు పంపడం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటి ఘటనలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. వీటిని సైబర్‌బుల్లింగ్ లేదా ఆన్‌లైన్ వేధింపులుగా పేర్కొంటారు. ఇలాంటి వేధింపులు ఎదురైనప్పుడు బాధితులు భయం, అవమానభావం, ఒంటరితనం, ఆందోళనకు గురయ్యే అవకాశం ఉంది. కొన్నిసార్లు ఈ ప్రభావాలు చాలాకాలం కొనసాగవచ్చు. వేధింపులను ఒంటరిగా భరించకుండా నమ్మకమైన కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సంబంధిత అధికారుల సహాయం తీసుకోవడం ముఖ్యం. అవసరమైతే వేధింపులకు సంబంధించిన ఆధారాలను భద్రపరచి, ఆ ఖాతాలను బ్లాక్ చేసి రిపోర్ట్ చేయాలి.

గంటల తరబడి ఫోన్ వినియోగం.. నిజ జీవితానికి దూరం

రీల్స్ చూడటం, వీడియోలు ప్లే చేయడం, ఇతరుల పోస్టులను పరిశీలించడం వంటి అలవాట్లతో చాలామంది గంటల తరబడి స్మార్ట్‌ఫోన్లలో గడుపుతున్నారు. ఫోన్‌ను పక్కన పెట్టాలని ప్రయత్నించినప్పుడు చిరాకు రావడం, పదేపదే ఫోన్ తనిఖీ చేయాలనిపించడం, చదువు లేదా పనులపై దృష్టి పెట్టలేకపోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. సోషల్ మీడియా వినియోగం వల్ల నిద్ర సమయం తగ్గడం, కుటుంబ సభ్యులతో గడిపే సమయం తగ్గిపోవడం, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లకు దూరం కావడం కూడా జరగవచ్చు. అందుకే ఆన్‌లైన్ ప్రపంచంతో పాటు నిజ జీవిత సంబంధాలు, వ్యక్తిగత అభిరుచులు, శారీరక చురుకుదనానికి కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలి.

సోషల్ మీడియా ప్రభావాన్ని ఎలా తగ్గించుకోవాలి?

సోషల్ మీడియాను పూర్తిగా వదిలేయడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. అయితే, దాని వినియోగంపై నియంత్రణ పెంచుకోవడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నించవచ్చు.

సోషల్ మీడియాకు సమయం నిర్ణయించుకోండి: రోజులో ఎంతసేపు ఫోన్ ఉపయోగించాలో ముందుగానే నిర్ణయించుకుని, అవసరానికి మించి వినియోగించకుండా చూసుకోండి.



లైక్‌లు, ఫాలోవర్లతో మీ విలువను కొలవకండి: ఆన్‌లైన్‌లో వచ్చే స్పందన మీ వ్యక్తిత్వాన్ని లేదా సామర్థ్యాన్ని పూర్తిగా నిర్వచించదు.

ఇతరులతో పోల్చుకోవడం మానుకోండి: సోషల్ మీడియాలో కనిపించేవి ప్రతి ఒక్కరి జీవితంలోని అన్ని కోణాలను చూపించవని గుర్తుంచుకోండి.

కుటుంబం, స్నేహితులతో సమయం గడపండి: ప్రత్యక్షంగా మాట్లాడటం, కలిసి భోజనం చేయడం, బయటకు వెళ్లడం వంటి అలవాట్లకు ప్రాధాన్యత ఇవ్వండి.

నిద్రకు ముందు ఫోన్‌కు దూరంగా ఉండండి: పడుకునే ముందు ఫోన్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా ప్రశాంతమైన నిద్రకు అవకాశం కల్పించవచ్చు.

మీ భావాలను పంచుకోండి: సోషల్ మీడియా కారణంగా ఒత్తిడి లేదా ఆందోళన కలిగితే నమ్మకమైన వ్యక్తులతో మాట్లాడండి. సమస్య ఎక్కువకాలం కొనసాగితే మానసిక ఆరోగ్య నిపుణులను సంప్రదించండి.

మీ మానసిక ఆరోగ్యమే ముఖ్యం

సైకాలజిస్ట్ రిచా అగర్వాల్ సూచించినట్లుగా, యువత తమ విలువను లైక్‌లు, వ్యూస్, ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా నిర్ణయించుకోకూడదు. ప్రతి ఒక్కరిలోనూ ప్రత్యేకమైన బలాలు, నైపుణ్యాలు, సామర్థ్యాలు ఉంటాయి. వాటిని గుర్తించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. సోషల్ మీడియా సమాచారాన్ని పొందడానికి, ఇతరులతో అనుసంధానమవడానికి ఉపయోగపడే సాధనమే. అయితే, దాని వినియోగం మన భావోద్వేగాలపై, నిద్రపై, రోజువారీ జీవితంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నట్లు అనిపిస్తే తగిన మార్పులు చేసుకోవాలి. ఆన్‌లైన్ గుర్తింపు కంటే నిజ జీవితంలోని ఆనందం, ఆరోగ్యకరమైన సంబంధాలు, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో ముఖ్యం.

(Disclaimer: ఈ కథనం సాధారణ అవగాహన కోసం మాత్రమే. మానసిక ఒత్తిడి లేదా ఆందోళన ఎక్కువకాలం కొనసాగితే అర్హత కలిగిన మానసిక ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోండి.)

సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించాలి

వనభోజనాలతో కుటుంబాల మధ్య ఆత్మీయత, ఐక్యత పెరుగుతుంది: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ





హైదరాబాద్ నవంబర్ 15 నిజం న్యూస్ మియాపూర్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ప్రకృతితో మమేకం కావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీలో ఆర్యవైశ్య సంఘం మయూరి నగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వనభోజన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం మయూరి నగర్ ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన మహోత్సవాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్తీక మాసంలో కుటుంబ సభ్యులు, కాలనీవాసులు, బంధుమిత్రులతో కలిసి చెట్ల నీడలో, ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద భోజనం చేయడం మన సంప్రదాయంలో విశిష్టమైన ఆచారమని తెలిపారు. ఈ వేడుకలు ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తాయని పేర్కొన్నారు. వనభోజనాలు కేవలం ఆహారం తీసుకునే కార్యక్రమం మాత్రమే కాదని, ప్రకృతి పరిరక్షణ, ఆరోగ్య సంరక్షణ, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. చెట్లు, మొక్కలు అందించే స్వచ్ఛమైన గాలి మానవ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ప్రకృతిని మనం కాపాడుకుంటే ప్రకృతి మనల్ని కాపాడుతుందనే గొప్ప సందేశం వనభోజనాల్లో దాగి ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెరగడంతో పాటు బంధుమిత్రుల మధ్య సాన్నిహిత్యం, పరస్పర అవగాహన మెరుగుపడతాయని తెలిపారు. కుటుంబాల మధ్య సంబంధ బాంధవ్యాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని గాంధీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, సభ్యులు, కుటుంబ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతితో మమేకమవుతూ సంప్రదాయాలను కాపాడుకోవాలి

వనభోజనాలతో కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయత, ఐక్యత పెరుగుతుంది: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ





హైదరాబాద్ నవంబర్ 15 నిజం న్యూస్ మియాపూర్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీలో ఉన్న రాక్ గార్డెన్ పార్క్‌లో దివ్య శ్రీ శక్తి అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వనభోజన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. దివ్య శ్రీ శక్తి అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన మహోత్సవాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్తీక మాసంలో కాలనీవాసులు, బంధుమిత్రులు కలిసి చెట్ల నీడలో, ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద భోజనం చేయడం మన సంప్రదాయంలో ప్రత్యేకమైన ఆచారమని తెలిపారు. ఈ వేడుకలు ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తాయని పేర్కొన్నారు. వనభోజనాల ద్వారా ప్రకృతి అందాలను ఆస్వాదించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుందని అన్నారు. చెట్లు, మొక్కలు మానవాళికి స్వచ్ఛమైన గాలిని అందిస్తూ ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రకృతిని మనం కాపాడుకుంటే ప్రకృతి మనల్ని కాపాడుతుందనే గొప్ప సందేశం వనభోజనాల్లో అంతర్లీనంగా ఉందన్నారు. ఇలాంటి సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య సాన్నిహిత్యం పెరుగుతుందని, పరస్పర సహకారం, బాధ్యతాయుత భావన, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. సంబంధ బాంధవ్యాలను మరింత బలోపేతం చేసే ఇలాంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని గాంధీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దివ్య శ్రీ శక్తి అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్